యిప్పుడరదవై యిందా" అని జ్ఞానోపదేశం చేసేడు హెడ్డు.

మరికొంతసేపటికి చార్జిషీట్లు తయారుచేసి సంతకాలు చేయించి ముద్దాయిల్నీ, కాగితాలనీ కానిస్టేబుల్‌కి వప్పగించి "నువ్వసలే కొత్తోడ్లాగున్నావ్! బయపడిపోక. కేసులునీమీద గాదులే కాయితాల్నీ ముద్దాయిల్నీ కోర్టు గుమాస్తా కప్పగించు. ఆ బాబు సూసుకుంటాడ్లే అంతా. ఇంతకీ ఈళ్ళంతా కేసులు ఒప్పేసుకుంటామన్నార్లే" అన్నాడు హెడ్డు.

❖ ❖ ❖

సాయంత్రం ఐదయింది.

కోర్టులో జనం పలచబడిపోయేరు. సాయంత్రం ఎండ కోర్టు ద్వారంలోంచి భయపడ్డ పసిపిల్లల్లా తొంగిచూస్తూంది.

ఎవరో జైలుక్కట్టేసినవాడి పెళ్ళాం, ప్రార్థించిన దేముడే పుస్తె తెంపేసినట్లు గొల్లుమంటూంది.

కాలవ్వార మనిషి కేసు పిలిచేరు. ఆమే "వైరుని" క్రితం రాత్రి అసభ్యంగా మర్యాదకి భంగకరంగా బహిరంగ స్థలంలో బూతు పాటలు పాడుతూ ఆహ్వానించింది- అన్న "నేరం వప్పే సుకుంది. ఆమెకు రూ. 20–00 లు జరిమానా విధించేరు.

ఆమె రెండు వారాలై చీరలకీ లోలక్కులకీ అద్దె కట్టలేదు.

"ఈ రేత్తిరి సాకల్ది కోకిప్పుకుపోద్ది. కంసాలోడు సెవులువి తెంపుకుపోతాడు. మొన్న ఎల్లాల్సిన డాట్రుదగ్గిరికి ఎల్లడానికి రేపుకూడా రెండు రూపాయలుండవు" అనుకుంటూ ఆమె జరిమానా కట్టేసింది.

మళ్ళీ ఆ పాతిక రూపాయలు ఆర్జించడానికి ఎన్ని కురుపుల పురుగుల్ని కౌగలించుకోవాలో, ఎన్ని పాముల మచ్చలు ముదు పెట్టుకోవాలో అన్న ఆలోచన రాగానే ఆమె ఆకులా వణికి పోయింది.

❖ ❖ ❖

ఆకులా వణికిపోయింది-అదే టైముకి ఆనందరావు హృదయం.

అప్పుడు అతను మరకతాన్ని రైల్లో సాగనంపుతున్నాడు.

అతనిదగ్గర చెక్కు పుచ్చుకుంటూ అతని చెయ్యి ప్రేమతో నిమిరింది ఆమె.

**(1971)**

# థేంక్స్ ఫర్ ది పీ.యమ్

"రమ్ము, పాఠక మహాశయా! మనము ఆ యాగంతకుని వెంబడింతము రమ్ము"

ఆ వరుస బంగళాలు సిమెంటు కేకుల్లా వున్నాయి. వాటి ముందు వయ్యారంగా వంగివున్న రోడ్డు, ఆ బంగళాలలో ఉండే వారి జోలికి దరిద్రం రాకుండా దేవుడు గీసిన గిరిలా ఉంది. దాని ముందున్న బీచ్ వెన్నెల కుప్పలా వుంది. సముద్రం మీద వెన్నెల వెండి ఆవిరిలా వుంది. ఆ వరుస బంగాళాల్లో వున్న 13 వ నెంబరు ఇంటి ఆవరణ ఆరెకరాలుంటుంది.

ఆ చలిరాత్రి దాన్లోని ఆకు కదలని చెట్లు ఆ వెన్నెల్లో రాతి చెట్లలా వున్నాయి.

ఆ ఇంటిగేటు పక్కనున్న గేరేజి కొత్త సబ్బు ముక్కలా ఉంది. ఆ బంగాళా పోర్టికోలో ఆగివున్న మూడుకార్లు రెక్కలు ముడుచుకున్న ఇనుపపక్షుల్లా వున్నాయి.

ఆ దారులు పక్కనున్న ఎర్రకుండీలు పసి పాపల దోసిళ్ళలా వున్నాయి.

వాటిలోని మొక్కల పూల బరువుకి వంగి, తీరిన కోరికల్లా ఉన్నాయి.

ఈ ఇంటి ముందున్న మొజాక్ మెట్లు కరుదు గట్టిన పాలముక్కల్లా వున్నాయి.

పై మెట్టుమీదున్న డోర్‌మేట్ స్పాంజ్ కేక్‌లా వుంది.

ఆ వరండాలో వున్న గుండ్రబల్ల పెనుపువ్వు, బొడ్డులా వుంది. కాని చుట్టూ వున్న ఎర్ర ప్లాస్టిక్ కుర్చీలు ఆ పువ్వు రేకుల్లా వున్నాయి. దాని మీదున్న నల్లగాజు కుండా తెగ బలిసిన తుమ్మెదలా వుంది.

ఆ వరండా చివర నిద్రపోతున్న బంట్రోతు బానిసలా వున్నాడు.

వరండా వెనుక హాల్లో సీలింగ్ మధ్య చిన్న ఆకుపచ్చని ఎలెక్ట్రిక్ లైటు పులి కన్నులా ఉంది.

నేలని హాలంతా పరిచవున్న రెడ్‌కార్పెట్ రక్తపు మడుగులా ఉంది.

ఆ బంగళాముందు ఒక నల్లటి కారు చప్పుడు చేయకుండా వచ్చి ఆగింది. దాన్లోంచి ఒక ఎత్తైన యువకుడు దిగాడు. అతని

సూటు నల్లగా ఉంది. అతని హేట్ ఫెల్ట్‌ది. అతని జోళ్ళ ఆడు గులు రబ్బరువి. అతని చేతిలో నల్లని సంచీ వుంది. అతని కళ్ళకి దళసరి అద్దాలు వున్నాయి. రమ్ము, పాఠక మహాశయా! మనము ఆ యాగంతకుని వెంబడింతము రమ్ము.

గేటు నెమ్మదిగా తెరచి అతను లోపల ప్రవేశించేడు. చప్పుడు చెయ్యకుండా వరండా ఎక్కి తన టార్చిలైటు వేసి బంట్రోతు నిద్రపోవడం చూసి సంతోషించినట్టు, తన కోటు కాలరు పైకెత్తి హేట్ అంచు కళ్ళవరకూ లాగి తలుపు మెత్తగా తోసేడు ఆ నల్ల సూటు వ్యక్తి.

తలుపు తీసే ఉంది.

అతను హాల్లోకి వెళ్ళి మేడమెట్ల మీద వెలుగుతున్న లైటుని ఆర్పేసేడు. ఆ ఇంటి కింద భాగంలో అలజడి లేదు.

అతను తన చేతిసంచీ తెరచి, దానిని పరీక్షించి, నిశ్శబ్దంగా మేడమెట్లు ఎక్కడం ప్రారంభించేడు. మెట్ల మలుపు వరకూ వెళ్ళే సరికి అదే సమయంలో మేడ దిగుతున్న ఒక యువకుడు అతన్ని గట్టిగా పట్టుకొని మేత్యూ దొంగొచ్చేడు అని గట్టిగా కేకవేసేడు.

ఆ కేకకిమేడమీద హాల్లోంచి ఐదుగురు యువకులు పరుగెత్తుకొచ్చి అతన్ని చుట్టుముట్టేరు.

"సారీ బ్రదర్స్ లేటైపోయాను" అన్నాడు ఆ నల్లసూటు మనిషి.

"నువ్వు టైముకి ఏ పార్టీకి వచ్చావు గనుక రెగ్గీ?" ప్రశ్న జవాబు చెప్పాడు చలపతి.

"నీ కోసం పెళ్ళి ఆపలేదనుకో" అన్నాడు సుందరం.

"మంచి పన్జేసేరు" నొచ్చుకోలేదు రెగ్గీ.

"ఇంకా రెండో రౌండులోనే వున్నాం" అన్నాడు డాక్టరు జగన్నాథం.

"మనకి మూడు రౌండ్లు అయితేనే గాని మందుకీ, మంచి నీళ్ళకి తేడా తెలీదు" – ప్రకటించేడు సుందరం.

"శుభం, తర్వాత తెలియనివ్వకు" నవ్వేడు రెగ్గీ.

అంతా మేడమీద హాల్లోకి వెళ్ళేరు.

తెరలచాటున చందమామల్ని దాచినట్టు హాల్లో కన్సీల్డ్ లైటింగ్ వుంది.

హాలు మధ్యలో మేహగనీ డైనింగ్ టేబిలు కొండకొలనులా నల్లగా వుంది.

దానిమీదున్న ప్లేట్లు ఆ కొలనులో పూసిన వింత పూలలా వున్నాయి.

ప్లేట్ల పక్కనున్న సీసాలు ఖరీదైన మందు సీసాల్లా వున్నాయి. వాటిలో ఒకరి రక్తం సీసాలా ఎర్రగా వుంది.

ఆ హాల్లో గోడన వున్న తైలవర్ణ చిత్రంలో ఒక ఎత్తు గుండెల పిల్ల వుండి, పిల్ల జాకెట్టు అడుగు గుండీలు తీసివున్నాయి. మీద గుండి ఆమె పెడుతోందో విప్పుతోందో చెప్పలేం.

❖ ❖ ❖

పార్టీ చాలా అప్ రోరియస్‌గా జరుగుతోంది. పార్టీలో వున్నది మొత్తం ఏడుగురు. అందులో ఐదుగురు మేత్యూ (మధు) రెగ్గి (రఘు), సుందరం, జగన్నాథం, జగన్‌మోహన్ – డాక్టర్లు, చలపతి కంట్రాక్టరు, వెంకట్రావు ప్లీడరు.

డాక్టర్ల స్నేహం చాలామంది చాలా కారణాల వల్ల చేస్తారు. కొంతమంది స్టేటస్ కోసం చేస్తారు. కొంతమంది ఉచిత వైద్యం కోసం చేస్తారు. మరి కొంతమంది సేంపిల్ మందుల కోసం చేస్తారు.

వెంకట్రావు "మందు"ల కోసం చేస్తారు.

చలపతి "నర్సుల" కోసం చేశాడు.

చలపతికి మందులో ఇంటరెస్టు లేదు. అలాగని అతను ఏ పార్టీ వదులుకోడు. అతనికి మొదటి రౌండుకి ఆకలి పోతుంది. రెండో రౌండుకి స్త్రీ వాంఛ చచ్చిపోతుంది. మూడో రౌండుకి నిద్ర వచ్చేస్తుంది. అతను ప్రస్తుతం మూడో రౌండులో వున్నాడు. అంచేత అతను ఇంతకీ ఈ పార్టీదేనికీ? అనడిగాడు ఆవలిస్తూ...

"నీకెందుకు అవన్నీను? మేత్యూ యిస్తున్నాడు. మనం తీసుకుంటున్నాం. ఎందుకైతేనేం?" ఒకడు కసిరాడు.

"దొరసాని కొరక బండిందేమోనని" చలపతి డౌటు

"నీ మనసులోది డౌటా? ఈర్ష్యా?"

"ఎఫ్.ఎస్‌గా వస్తే ఇద్దరన్నట్టు. రెండూనా!

"బుద్ధి గట్టితిని అడిగాను"

ఇంక తినకు, అసలు నువ్వెందుకొస్తావ్ ఈ పార్టీకి?

"నువ్వు తాగవ్, మమ్మల్ని తాగనియ్యవ్!"

"తోడేలుతో గొర్రె ప్లిలన్నట్టు"

"చలపతీ! వెనగ్గదిలో పరుపుంది"

"దానిమీద చలవచేసిన దుప్పటీ వుంది"

"రెండు దిళ్ళూ, ఒక బాలీసూ వున్నాయి"

"పోయి పడుక్కో"

"ఇంతకీ పార్టీ ఎందుకఁరా అంటే పడుక్కోమంటారేఁవిఁటి?"

"పార్టీఁవా? ఎందుకైతే నేఁవిఁట్లే?" మేత్యూ అన్నాడు.

"మేత్యూ రేపు అశ్వమేథయాగం చేస్తాట్ట" అందుకు.

"అందులో గుఁర్రానివి నువ్వే. పొద్దున్నే చాలా పరిగెత్తాలి. పడుక్కో అమ్మా"

"హెవరు పరిగెత్తాలి"

"నువ్వేనమ్మా. బజ్జో బాబూ"

"పార్టీ ఎందుకో చెప్పకపోతే నేను పడక్కోను" చలపతి మొండికెత్తేడు.

"పార్టీవా..." సిగరెట్టు అంటిస్తూ అడిగేడు మేత్యూ. ఒక గమ్మత్తు జరిగింది.

"హే గఃవఁత్తు?"

"ఎప్పుడు?"

"నిన్నరాత్రి...."

❖ ❖ ❖

నిన్నటి వెన్నెల రాత్రి, వెండి పౌడరు అద్దుకుంది.

వెచ్చదనం పుట్టించుకోగలిగిన వాళ్ళకి కావలసినంత చలి వుంది.

అప్పటికప్పుడే సెకండ్ షోలు మొదలు పెట్టేశారు. రోడ్లు పలచబడిపోయేయి.

ఎమర్జెన్సీ వార్డు నుండి చూస్తే దూరంగా వున్న ఆస్పత్రి అద్దాల మేడలా వుంది. ఎమర్జెన్సీ వార్డు మాత్రం నిర్జీవంగా, నిశ్శబ్దంగా వుంది. దాని వరండా మీద చీకటిలో తోటీ సింహాచలం తాగిన మత్తు నిద్రలో వున్నాడు.

వార్డులోని గోడవాచీ సమ్మెట పోట్లతో కాలాన్ని సాగకొడుతోంది.

రూములో మధ్య టేబులుంది. దాని మీద ఖద్దరు గుడ్డ ఉంది. ఆ గుడ్డమీద పుస్తకం ఉంది. దాన్ని రెండు కళ్ళు చదువుతున్నాయి.

పుస్తకం "పండితుల కోసం పుదుచ్చేరినందు ప్రత్యేకం ముద్రించబడినది"

కళ్ళు నర్స్ సరోజవి. పుస్తకం చదువుతున్న సరోజకి యింక చదవాలన్న కోరికలేదు. అప్పటి కోరిక గురించి రాస్తే గౌరవస్థులు చదవరు. కాని అది మాత్రం అటువంటి పుస్తకం చదివితే అరవైయేళ్ళవాళ్ళకైనా కలిగే కోరికే.

ఆమె ఎముకల్లో అనిర్వచనీయమైన పీకు ప్రారంభ మైంది. గుండెలు భారం ఎక్కువై ఎదురు గోడని వెళ్ళి గుద్దెయ్యాలని పిస్తోంది ఆమెకు.

ఎదురుగా వున్న టేబులుని వంచి విరిచెయ్యాలని వుంది.

మార్పు కోసం ఆమె ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసుకొని తాగింది.

తాగేక నిప్పుల నీళ్ళు తాగినట్టు అనిపించింది ఆమెకి. ఆమె వూపిరి వదులుతున్నప్పుడు నిప్పుల రవ్వలు బైటకు వస్తున్నట్టనిపించింది. ఆ తాపానికి శాంతి...

కప్పు నేలని కొట్టేయ్యాలి.

టేబిలు గోడకేసి కొట్టెయ్యాలి.

లేకపోతే నిద్రమాత్ర!

ఎన్నాళ్ళీ మాత్రలు?

మాత్రలు లేని రాత్రి – మందు లేని రాత్రి – పేషెంట్లు లేని రాత్రి – సరసం చేసిన డాక్టరు ఆగిపోని రాత్రి.

ఈ నెల మరి రాదు.

అబ్బా ఒక నెల! అమ్మో ఒక నెలే?

ముప్ఫై రాత్రులే!!

ఆదే రాత్రి –

కమల కుర్చీలో కూర్చుంది. ఎదురుగా అద్దంలో తన మొహం చూసి పోల్చుకోలేనట్లు తుళ్ళి పడింది.

❖ ❖ ❖

అద్దం ముందు కూర్చున్న కమల పెళ్ళి కూతురులా వుంది.

ఆ గది ఆకుపచ్చని రంగు, ఆకుపచ్చని లైటు కాంతికి చిక్కబడి నాచుపట్టిన మొసళ్ళ చెరువులా వుంది.

ఆ గది తలుపులు, కిటికీలు మూసివేయడం వలన గాలి వేడిగా వుంది.

ఆ వేడి గాలికి కమల చర్మం వేడెక్కి జ్వరం వచ్చిన ట్టుంది. ఆమె ఏదో యిష్టం లేనిపని చేస్తున్నట్టు, ఆ పని తప్పుపని అయినట్టూ, ఆమె మొహంలో భయం, ఆతృతా కనిపిస్తున్నాయి. భయంవల్ల ఆమె పెద్ద కళ్ళు ఇంకా పెద్దవై వాటి సహజ సౌం దర్యం పోగొట్టుకున్నాయి.

ఆమె పట్టుచీర జరీ పువ్వుల్లోనూ, ఆమె ఆభరణాల్లోనూ పడి ప్రతిబింబిస్తున్న విద్యుత్కాంతి ఆమె అందాన్ని డిస్ట్రాక్ట్ చేస్తోంది.

ఆమె భుజాలపైన వేసుకున్న నైలాన్ గుడ్డ వెన్నెల పొరలా వుంది.

ఆమె నగలు ఆరు వీసెలు బరువుంటాయి. ఆమె వాటిని అసహ్యించుకుంటున్నట్టు కనిపిస్తోంది.

ఆ ఆభరణాలలో రాళ్ళు రంగుల పురుగుల్లా కనిపిస్తు న్నాయి ఆమెకు.

ఆమె వడ్డాణం సన్నని నడుముకు చుట్టుకున్న బంగారు పాములా వుంది.

ఆమె పట్టుచీర పువ్వులు ఆమె చుట్టూ పెరిగిన విష వృక్షం పూసిన జరీ పువ్వుల్లా వున్నాయి.

అద్దంలో ఆమె తన ముఖం చూసుకుంది. భయం వల్ల బయటకు కనిపించేటంతగా వణికిపోతున్నాయి ఆమె పెదవులు.

చేసుకున్న ముస్తాబూ, పెట్టుకున్న ఆభరణాల తీరూ చూస్తే లేచిపోయే పెద్దింటి ఆడదానిలా ఉంది. కాని బైట బ్యాండు సంగీతం కోలాహలం వింటే, ఆమె ఇష్టం లేని పెళ్ళి చేసుకుం టున్న మనిషిలా ఉంది.

ఈలోగా తలుపు చప్పుడు చెయ్యకుండా తీసి ఒక వ్యక్తి గదిలో ప్రవేశించి తలుపు మూసేశాడు. అతనికి ముప్పయి ఐదేళ్లు ఉండవచ్చు. ముప్పై ఐదేళ్లు కసరత్తు చేసిన మనిషిలా అతిబలంగా భారీగా ఉన్నాడు అతను. అతను కనుబొమ్మలు దుక్క గొంగళీ పురుగుల్లా ఉన్నాయి. అతని వంకీల జుత్తు సాగ తీస్తే మూడుమూర లుండొచ్చు. అతని సన్నని మీసం చిరుకత్తుల జతలా వుంది. అతని టెర్లిన్ షర్ట్ పాము పొరలా వుంది. అతని మెడచుట్టూ వున్న స్కార్ఫ్ చారల పాములా వుంది.

వంగినప్పుడు కూడా తన మొహం చూసుకునే ఉద్దేశం తోనే పాలిష్ చేసినట్టు ఉన్నాయి అతని జోళ్ళు.

అతని కుడి బుగ్గమీద ఇంటూ మార్కు లాంటి మచ్చ రౌడీల దెబ్బలాటలో తగిలిన గాయం మచ్చలా వుంది.

అతని షర్ట్ కుడి చెయ్యి, చేతి కండలు చూపడానికే మడత పెట్టినట్టు మడత పెట్టబడి వుంది.

అతని కుడి ముంజేతికి పది అంగుళాల తోలు పటకా వుంది. ఆ పటకాకి అక్కడ అక్కడా ఇత్తడి ముళ్లు ఉన్నాయి. ఆ పటకాతో ఎవర్నేనా మోడితే మూడుసేర్ల రక్తం కారుతుంది.

అతని నోట్లో బీడీ ఆరిపోలేదు.

ఆ వ్యక్తి హీరోయిన్ని పెళ్ళి చేసుకోవడానికి తయారయిన విలన్లా వున్నాడు.

అతన్ని చూసి భయంతో పరుగెత్తింది కమల.

ఆమెను ఆటంకపరచడానికే నన్నట్లు అతను చేతులు బారుగా చాపాడు. ఆమె మూడు అడుగుల్లో అతన్ని చేరి అతని చేతుల్లో వాలి పోయింది.

అతను ప్రేమతో ఆమె తల నిమురుతూ ఎలా ఉంది అని అడిగేడు.

"భయం వేస్తోంది ...."

"మధ్యలో భయపడితే ఎలా?"

ఈ లోగా తలుపు అతి మెత్తగా తట్టిన చప్పుడు అయింది.

కమల మూడు అంగల్లో వెళ్ళి కుర్చీలో కూలబడి జుత్తు చేత్తో సవరించుకుంటున్నట్లు నటించసాగింది. స్కార్ఫ్ సర్దు కుంటూ అతను తలుపుతీశాడు.

ఇద్దరు మగాళ్ళు పూల దండలు పట్టుకొని గదిలోకి వచ్చేరు. వాళ్ళలో చిన్నవాడు విలన్ మెడలో దండవేశాడు. రెండోవాడు కమలారావుగారూ! మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియడం లేదు అంటూ దండ ఆమెకు అందించేడు.

దండ అందుకుంటూ కమల "నాకు భయం వేస్తోంది" అంది.

"మొదటి రాత్రి అందరికీ అలాగే ఉంటుంది. మీరు భయ పడకండి అన్నాడు చిన్నవాడు" ద్వంద్వార్థం కళ్ళతో.

పెద్దవాడు "విలన్" వేపు తిరిగి ఆమోఘం. "మీ ఇద్దరి నటనా బ్రహ్మాండం. ఈ నాటకంతో ఆంధ్రదేశం అంతా జయిం చెయ్య వచ్చు. భార్యాభర్తలైయుండి మీలో హీరోయిన్-విలన్లు వెయ్యడం" ఒక ప్రత్యేక ఆకర్షణ అన్నాడు.

చిన్నవాడు కమలతో "మీకు ఇదివరకు స్టేజి అనుభవం లేదంటే నమ్మలేం" అన్నాడు.

"రెండోసీన్ సెట్టు వేస్తున్నారు. సీన్ మీతోనే ప్రారంభిస్తుంది. వేగం సిద్ధంకండి" అన్నాడు కమలతో పెద్దవాడు.

కమల జవాబు చెప్పేలోగా బైట పెద్ద కోలాహలం. హాలు అంటుకుంది అన్న కేకలూ వినిపించేయి.

హాలు అన్న ఒక్కమాటే గదిలోంచి విన్నారు. పూలదండల డైరెక్టరూ, అసిస్టెంటూ,వాళ్ళు గది దాటగానే తలుపులు గాలికి మూసుకు పోయేయి.

కమల ఆత్రంగా పరుగెత్తి తలుపుతోసింది. కాని తలుపు రాలేదు. అయ్యో తలుపు రాలేదండీ అంది వణుకుతున్న గొంతుతో.

నన్ను తియ్యనీ, అతను తోసినా తలుపు రాలేదు.

బైట నిప్పులపాముల చీలిక నాలుకల్లా మంటలు లేస్తు న్నాయి. మనుషుల ఏడుపులకి పేలుతున్న వెదుళ్ళు లయ వేస్తున్నాయి. బాబూ తలుపు తియ్యండి అని దీనంగా అరుస్తూ కమల చేతుల్తో తలుపుమీద గట్టిగా కొట్టింది. ఆమె చిటికిన వేలు బద్దలై తలుపుమీద రక్తం కారింది.

ఆకుపచ్చని లైటుకాంతిలో ఆ రక్తం కాటుక కంటి నీరులా నల్లగా ఉంది.

"నువ్వు భయపడకు కమలా" అతను ధైర్యం చెప్పేడు.

"భయపడకంటారేఁవిఁటండీ? అయ్యో భగవంతుడా! ఇప్పుడేం చెయ్యమంటావ్? వేగం ఆలోచించండి. లేకపోతే మనం చచ్చిపోతా మండీ! కాలిపోయి చచ్చిపోతామండీ... ఆ కిటికీ తెరవండి ... మన చచ్చిపోతే కన్న... ఆమె దెయ్యాన్ని చూసిన మనిషిలా ఆగిపోయింది.

ఆమెమాట్లాడకుండా ఉండే అతనుకిటికీ తెరిచి "భగవాన్ " అని కళ్ళు మూసేసుకున్నాడు.

అతను కిటికీ తెరవగానే మంట నిప్పుల మేఘంలా గదిలో ప్రవేశించింది. ఆ మంటకి అతని విగ్గూ, స్కార్ఫూ, కృత్రిమపు కను బొమ్మలూ, షర్టూ అంటుకున్నాయి.

"కమలా" అంటూ అతను ఆమె వేపు తిరిగేడు.

ఆమె మొహం మీద చమట బిందువులు మంటల ఎర్ర కాంతిలో రక్తం బిందువులులా ఉన్నాయి.

అతను కాలిపోయిన కళ్ళతో ఇక బతకను అని తెలిసి పోయిన మనిషిలా భాషలేని పెనుకేక వేసి పరిగెత్తడం ప్రారం భించేడు.

అయ్యో ఆగండి అంటూ ఆమె అతన్ని వెంబడించింది.

వాళ్ళు గరళం లాంటి చీకట్లో పరుగెత్తుతున్నారు. కాని వాళ్ళని ఒక నిప్పుల మేఘం వెయ్యి నాలికలు చాపి వెంబడిస్తోంది.

కత్తులు, రాళ్లు, విరిగిన ముళ్ళు, విషపు చీకటి, నిప్పుల వర్షం, బతికుండగానే కాలిపోతున్న మనిషి వెనుక బ్రతికుందో చచ్చిపోయిందో తెలుసుకోలేని ఆమె.

ఆమె అలసిపోయి పరిగెత్తలేక ఆగింది. తను చచ్చిపోయి నట్టూ –తనను పాతిపెట్టేసినట్టూ–తనకు చచ్చిపోయేక పీడకల వస్తున్నట్టూ ఆమెకు అనిపించింది.

కల కాదు. ఈ పగిలిన పాదాల రక్తంలో అబద్ధం ఏమీ లేదు.

అంతా నిజం! నిజం!

కళ్ళు మూసుకున్న ఆమెకు మేఘం దగ్గర పడ్డట్టు సరసర మన్న శబ్దం వినిపించి తిరిగి పరుగు ప్రారంభించింది.

కాలికింద ఏమిటది మెత్తగా – ఈ చీకటి చెట్ల వెనుక ఆ పచ్చని కళ్ళు ఎవరివి?

అరణ్యాల అంధకారంలోకి విషపు నాగుల లోతుల్లోకి వారిని ఆ వెర్రిమేఘం వెంట తరుముతూనే ఉంది.

ఊపిరిఅందని కమల "నన్ను కాల్చేసినా ఇక పరుగెత్తలేను స్వామీ" అంటూ ఒక కత్తుల బండమీద పడిపోయింది.

❖ ❖ ❖

నిద్రలో పరుగెత్తిన కమల మంచం తన్నుకొని బిడ్డమీద పడిపోయింది. లేచి కళ్ళు విప్పేసరికి మంచంమీద పిల్లడికి బదులు పిశాచం కన్పించినట్టు అనిపించింది ఆమెకి. పిల్లడికి ఊపిరి సరిగా ఆడడంలేదు. చూపు తగ్గిపోయి కళ్ళు తేలి పోయేయి.

"బాబూ కన్నా! కన్నా! ఏమైంది బాబూ? మాట్లాడవే?" అని భుజాలు పట్టుకుని కుదిపింది.

కన్న "అమ్మా" అనబోయాడు. విడిన పెదిమలు మూసుకొని పోయాయి. కాని మాట రాలేదు. ఆ "అమ్మా" అన్నమాట ఆమె చెవులకి వినిపించలేదు. కాని వినగలిగిన పేగులు కిరకిర చుట్టుకు పోయాయి.

ఆ రోజూ, అంతకుముందు రోజూ కాస్త నలతగా వుంది కన్నకి. అంతే. కాని అంతలోనే విషం కక్కే ఈ చీకటి రాత్రి పడ గానే ఏ నల్లనాగు కరిచింది? ఏ మహామారి నాలుక చాచింది?

ఏమైంది? చెప్పు బాబూ - చెప్పు కన్నా - ఎలా వుంది బాబూ?- ఒక్కసారి అనవూ, బావున్నానే, అని ఒక్కసారి అనవూ? అను బాబూ - నా తండ్రీ - ఒక్కసారి - అను-బతికి నన్నాళ్ళు యిలా నీ దగ్గరే వుండిపోతాను. యింకెప్పుడూ నిన్ను వదలి వెళ్ళను బాబూ - ఈ పూట నా దగ్గరే వుండమ్మా అని కాళ్ళకి చుట్టుకున్నా వినకుండా వెళ్ళిపోయాను. తప్పు చేశాను కన్నా - తప్పు చేశాను-

....కాని నీకు తెలీదు బాబూ, ఎందుకు వెళ్ళేనో - నువ్వు పసి వాడివి - నీకు తెలీదు. నా కోసం వెళ్ళలేదు నాన్నా, నేనె ప్పుడో చచ్చిపోయాను.

వెళ్ళింది నీ కోంస - తప్పక వెళ్ళేను. కాని, యింకెప్పుడు వెళ్ళను తండ్రీ - నీ దగ్గరే వుండిపోతాను - నేను బాగానే వున్నాను అను తండ్రీ - యిలాగే నిన్ను పట్టుకొని వుండిపోతాను - యిలాగే చచ్చిపోతాను - ఒక్కసారి అను బాబూ - పిచ్చెత్తిన మనిషిలా ప్రార్ధించింది.

కాని కన్నచూపులో బెదురు పోలేదు.

❖ ❖ ❖

రిక్షాలో ఆమె - ఒళ్ళో ఊపిరి సలపని పిల్లడు తెగిపోయిన పేగులా వేలాడిపోతున్నాడు.

"స్వామీ - ఈ ప్రయాణం" అక్కడికేనా?

తెగిపోయేట్టు పటపట లాండింది రిక్షా చైను.

క్రిందటి సంవత్సరం సరిగ్గాయిలాగే అతన్ని రిక్షావాడు నల్ల వీపుతో సత్తుమేకులు కొట్టినట్టు వెన్నెల మెరుస్తోంది.

గూటిలో గువ్వలా ఆమె రిక్షాలో ముడుచుపోయింది.

"అక్కడ మందులకి..."

గూటి ద్వారం దగ్గర గూబని చూసిన గువ్వలా ఆమె గజగజ వణికిపోయింది.

"నేను ఈదలేను ప్రభూ! ఈ నిప్పుల ఏరు, నేనెక్కలేను. తండ్రీ ఈ కత్తుల పర్వతం, నన్ను చంపీ తండ్రీ చంపీ, కావా లంటే ముక్క ముక్కా కోసి, నరనరం తెంపి, మెల్లిగా తాపీగా చంపు, కాని చంపీ, నాకీ బతుకే తరగని మరణం నాకు చావే చల్లని ఆశీస్సని" ఆమె ప్రార్థించింది.

ఆమెకు చావు రాలేదు.

❖ ❖ ❖

రాత్రి పావు తక్కువ పదకొండు.

నర్స్ సరోజ నిద్రపోతోంది.

తోటి సింహాచలం నిద్రపోతున్నాడు.

"అమ్మా.... బాబూ...."

అమ్మా... బాబూ లేవలేదు.

"తల్లీ"

తల్లి లేవలేదు.

"అమ్మా"

తల్లి ఒక కన్ను విప్పింది

"తల్లీ"

అమ్మ రెండో కన్ను విప్పింది.

"అమ్మా - తల్లీ"

అమ్మ తల్లి కళ్ళు మూసేసుకుంది.

ఆవిడ నిద్ర లేచేసరికి ఐదు నిమిసాలు పట్టింది. సంగతి తెలియచెప్పేసరికి మరో ఐదు నిమిసాలు పట్టింది, కమలకి.

"ఎప్పట్నుంచీ ఈ రోగం"

"ఎప్పట్నుంచో లేదు తల్లీ, నిన్న కొంచెం నలతగా వున్నాడు . అంతే. ఈ వేళ కాస్త వెచ్చ తగిలింది. రాత్రి మామూలు గానే పడుకున్నాడు. ఇంతలోనే ఈ మాయరోగం వచ్చింది"

నర్స్ ఆమెను పరీక్షగా చూసింది.

ఆమె ఒంట్లో అర్ధసేరు మాంసం లేదు.

పిచ్చి ఎత్తబోయే మనిషిలా వుందామె.

ఆమెకు నోరు నవ్వటానికి కాకుండా ఏడవటానికి భగవం తుడు ఇచ్చినట్లుంది.

వేషం వేయించినా దాసి వేషానికే తగిన మనిషిలా ఉంది.

పీడకల వాస్తవం ఐన మనిషిలా వుంది.

"ఇంకెక్కడికైనా తీసుకెళ్ళలేకపోయేవా?"

వల్లకాడు తప్ప వెళ్ళడానికి రెండో చోటు లేని మనిషిలా మాట్లాడకుండా వుండిపోయింది.

"సింహాచలం.." నర్స్ సినిమాలో హీరోయిన్‌లా పిల్చింది. సింహాచలం లేవలేదు. విలన్‌లా పిల్చింది. అతను లేవలేదు. ఆడపులిలా అరచింది. అతను లేచాడు.

"డ్యూటీ డాక్టరుని పిలు"

సింహాచలం వెళ్ళేడు. వెళ్ళిపోయేడు.

అమ్మా, కొంచెం తొందరగా...

"నేనేం చేసేదమ్మా, నేన్నర్సుని" డాక్టర్... డాక్టర్...రావాలి!

డాక్టర్ రాలేదు.

"డ్యూటీ రూములో లేరు.." సింహాచలం అన్నాడు.

"ఎందుచేత లేరు?ఇంద" ఈ మెమో పట్టుకెళ్ళు.

మెమో డ్యూటీ రూంలో డాక్టరుని పుట్టించలేదు.

"సినిమాకి వెళ్ళేరు –" సింహాచలం వచ్చేశాడు.

అమ్మా, పిల్లాడికేదో అయిపోతోంది.

"అది అంతే. వూరుకోమ్మా – సినిమాకిపట్టుకెళ్ళు మెమో, నువ్వు కాదు – సింహాచలం నువ్వు"

సినిమాకి వెళ్ళిన డాక్టరుకి కాకినాడ నుండి వచ్చిన ఫస్టి యరు ఖాతాపిట్ట కనిపించింది. డాక్టరు భుజం మీద వాలింది.

పిట్టా –డాక్టరు బీచికి వెళ్ళారు – ఆ సంగతి వాళ్ళకే తెలుసు.

గంటన్నరకి సింహాచలం వచ్చాడు. సినిమాలో లేడు. ఇంటి కాడలేడు.

"ఎవరు డ్యూటీ డాక్టరు?"

"మేత్యూ బాబు"

"అన్ని చోట్లూ చూడు.

లైబ్రరీలో వున్నారేమో తీసికు రా"

లైబ్రరీ నుంచి మేత్యూ బాబు రాలేదు. రెగ్గీబాబు వచ్చేడు. వంటిగంటకి. అతను ఖద్దరు ఫ్యాంటు ఖద్దరు స్లేకూ తొడుక్కున్నాడు.

అతని ముఖం అతి మంచివాని ముఖంలా దయతోను, తెలివితోనూ కళకళ్ళాడుతోంది. వున్న వయస్సు కంటే ఐదు సంవత్సరాలు ఎక్కువ కనిపిస్తాడు అతను. అతని ముక్కు పచ్చని సన్నగీతలు అప్పుడే లోతుబారుతున్నాయి.

అతని కళ్ళూ, ముక్కూ మెరుగ్గానే వున్నాయి. అతను తెల్ల గానే వున్నాడు. పొడుగ్గానే వున్నాడు. అతని జుత్తు నల్లగానే వుంది. అతను అందగాళ్ళలోనే లెక్క. అతని బేరింగులో ఒక డిగ్నిటి వుంది.

అతని కళ్ళజోడు ఫారిన్‌ది.

కళ్ళజోడు ఖరీదైనదే.

జేబురుమాలు సిల్కుదే.

అయినా అతని మొహం మీద మంచివాడు అనే బోర్డు కట్టినట్టుంది. అతను ఆఫీసరు సీట్లో కూర్చుని వున్నా ఎవరూ సరాసరి వెళ్లి మాట్లాడ్డానికి మొహమాటపడరు. అతను ఎంత పెద్దకార్లో కూర్చున్నా, అతన్ని టైము అడగటానికి ఎవరూ భయపడరు. అతను ఏ రోడ్డు మీద ఉన్నా, అతన్ని డబ్బు లడగ టానికి ఏ ముష్టివాడు జంకడు. అతనిలాంటి తోబుట్టువు వుంటే బావుండుననిపిస్తుంది ఎవరికైనా.

"ఇతను ఎప్పుడూ అబద్ధం ఆడడు. ఎన్నడూ ఏ పాపం చెయ్యడు. ఎవరికే సహాయం కావాలన్నాకాదనడు అనిపిస్తుంది" అతన్ని చూస్తే.

అతను వార్డులోకి వచ్చేసరికి బెంచీమీద కూర్చున్న కమల కనిపించింది.

భర్త శవాన్ని చూడలేని పెళ్ళికూతురిలా ఆమె చేతుల్లో మొహం దాచుకుంది. నువ్వు ఛస్తే నీ పెళ్ళాం యిలా అయిపో తుందీమోనని నువ్వు బయపడేట్లు వుంది ఆవిడ.

ఆమెకు ముప్పై ఏళ్ళుండొచ్చు. కాని నూరేళ్ళూ నిండి పోయిన మనిషిలా వుంది. ఆమె కట్టుకున్న అద్దెచీర పూర్తిగా మాసిపోలేదు.

డాక్టర్ని చూసిన ఆమె వినయంగా లేచి తలదించుకొని నిల్చుంది. చెయ్యకూడని పనిచేసి దొరికిపోయిన దానిలా సిగ్గు కంటే ఎక్కువ భయపడుతూ నిల్చుంది.

గొప్పింటి వాళ్ళింటికి పెళ్ళికి, చిన్ననాటి పరిచయంతో వెళ్ళి, వెళ్ళినందుకు విచారిస్తున్నదాన్లా యిబ్బందిగా, అపోల జిటిక్‌గా నుల్చుంది. బల్లమీద గుడ్డక్రింద పిల్లడు జబ్బు మూటలా వున్నాడు.

అతని పక్క నిల్చున్న కమల చిన్న జబ్బు పక్కన పెద్ద జబ్బులా నిల్చుంది.

వస్తూనే పేషెంటు నాడి చూస్తూనే... డాక్టర్ రెగ్గి థియేటర్ రెడీ చేయనందుకు నర్స్ సరోజని నిందించేడు. "మనుషులంతా ఒకటేనని మీకు ఎప్పటికి తెలుస్తుంది! యిప్పుడు జరగకూడనిది జరిగితే ఎవరిది పూచీ?" అని విసుక్కున్నాడు.

వెంటనే పేషెంటుని ఎత్తుకొని థియేటర్ పక్క రూములోకి పరిగెత్తేడు.

ఆగిపోయిన యుద్ధం మళ్ళీ మొదలైనట్లు ఆస్పత్రి మేలు కుంది. థియేటర్లో లైట్ల వాన కడిగిన నక్షత్రాల్లా కళకళ్ళా డేయి.

కమల కళ్ళలో ఆశనిరాశలు, సీసా (See Saw) అడుకుం టున్నాయి.

"కిందటేడు–సమంగా ఈ ఆస్పత్రిలోనే ఈ టైముకే ఇలాంటి డాక్టరు బాబే..."

పెద్ద ఇళ్ళలో ఏడవకూడదని తెలిసిన పెద్ద మనిషిలా ఆమె కళ్ళలో నీళ్ళు ఆపుకోవాలనుకుంటోంది. నోటిలో కుక్కుకున్న ఆమె చీర ఎర్ర అంచు రక్తం కక్కుకున్న మనిషి నోటి దగ్గర రుమాలులా వుంది.

పది నిమిషాలైంది.

మెళ్ళో స్టెతస్కోపుతో, చేతిలో నోటుబుక్కు కళ్ళలో ఆత్రుతతో రెగ్గీ రూమ్‌లోంచి బైటికి వచ్చేడు.

కమల ఒక అడుగు ముందుకు వేసి బాబూ ఎలా.. "అనీ" "వుంది" అనలేకపోయింది.

"ఫర్వాలేదు" అన్నాడు రెగ్గీ. తన ఆత్రుత ఆమె అపార్థం చేసుకున్నట్టు చూస్తూ – కాని ఏదో దుర్వార్త చెప్పలేని వాడిలా బాధపడుతున్నాడు అతను.

"అమ్మా.. ఈ మందులు... ఆ ఎదురుషాపులో..." చచ్చిన పిల్లా డికి సుంకం కట్టమన్న హరిశ్చంద్రుడి కాఠిన్యం అతనికి లేదు.

"బాబూ..." నన్ను నిలువునా కాల్చినా, నాలుగు డబ్బులు రాలవని ఆ బాబూ అర్థం.

ఫర్వాలేదమ్మా, నాదే పొరపాటు, నిన్నడకుండా ఉండవల సింది – స్టాకు నుండి తేడానికి ఆలస్యం అవుతుందే మోనని యింకెప్పుడూ పాపం చెయ్యనని దేవత దగ్గర ప్రమాణం చేస్తున్న వాడిలా అన్నాడు.

సింహాచలం డాక్టరు రాసిన మందులు తేవడానికి పరుగెత్తేడు.

రెగ్గీ కమల కళ్ళలోకి దీక్షగా చూస్తున్నాడు. అయినా కమలకి యిబ్బంది అనిపించలేదు.

"తల్లీ! నువ్వేం అనుకోకపోతే..."

అడుగు బాబూ అన్నట్టు చూసింది.

"నీ ... ఆ పిల్లడి తండ్రి..." మరి అడగలేకపోయేడు.

"కాలిపోయేడు" చచ్చిపోయేడు అననందుకు ఆమె తనని తనే నిందించుకుందీ. అయ్యో పాపం. ఐయామ్ సారీ. ఎక్స్ట్రీమ్లీ సారీ ఇంగ్లీషు ఆమెకు రాకపోవచ్చని తెలుసుకో లేని వాడిలా విచారించేడు.

"మరి నువ్వు... నీకు?"

"రికార్డు డాన్సులు... ఒకప్పుడు చేసేది" ఇప్పుడు పేవ్ మెంటు పువ్వులు.

మొగ పంజాలకి దూది బొమ్మ.

"ఐ యామ్ సారీ" (I am sorry) అనలేదు రెగ్గీ. కాని ఆ ప్రశ్న వెయ్యకుండా వుంటే బావుండుననిపించింది అతనికి.

కాని తన వృత్తి చెప్పేశాక, తన ధైన్యం తోబుట్టువుతో చెప్పు కున్నట్టు కమల మనస్సు తేలికపడింది.

తర్వాత నిమిషాలు తొందరగా గడిచిపోయేయి, కమలకి కూడా.

సింహాచలం మందులు తెచ్చేడు. "తండ్రీ?"

థియేటర్ రెడీ అయింది భగవాన్!

ఆపరేషను దుస్తుల్లో అంతరిక్ష యాత్రికుడిలా రెగ్గీ రూము లోంచి వచ్చేడు.

"నా బిడ్డను కాపాడు తండ్రీ!" సైలెంట్ ప్రేయర్.

స్ట్రెచ్చెరు మీద పిల్లాడ్ని థియేటర్లోకి తీసికెళ్ళేరు.

"నన్ను తీసుకుపో స్వామీ..."

❖ ❖ ❖

ఆపరేషను మొదలుపెట్టే ముందు పేషెంటు పల్స్ చూసిన నర్స్, "డాక్టర్" అని పిల్లడు పిశాచమైపోయినట్టు భయంతో కేక పెట్టింది.

"షటప్! చెప్పింది చెయ్యి, చేతకాకపోతే బయట తగలడు" రెగ్గీ కసిరాడు.

ఫస్ట్ యిన్సిషన్ – కంఠం మీద మొదటి కత్తి కోత పుస్తకాల్లో చెప్పినట్టే వచ్చింది.

❖ ❖ ❖

మనుషుల మంచితనం మీద తిరిగి నమ్మకం కుదురుతున్న దానిలా మనోబలంతోనూ, ధైర్యంతోనూ, ఆ నమ్మకం ఒకసారి పోగొట్టుకున్నందుకు చింతిస్తున్న దానిలా విచారిస్తూనూ కూర్చుంది కమల.

తోపుడు బళ్ళలో చిన్న పిల్లల్లాగా ఆవిడ కళ్ళముందే రెండు ఆక్సిజన్ సిలెండర్లు థియేటర్లోకి వెళ్ళాయి.

"నాలాటి దాని... రికార్డు... డాన్సరు... చవకబారు.. దాని కొడుక్కి కూడా దేవుడున్నాడు"

ఖరీదైన వైన్ సీసాల్లా బ్లడ్‌ప్లాస్మా సీసాలు పట్టుకొని థియేటర్లోకి పరిగెత్తింది మరో నర్సు.

"ఇంతమంది నర్సులు... ఇన్ని మందులు యింతమంచి డాక్టరు.. యిప్పుడేమైపోయినా... భగవాన్... ఏమిటీ తప్పుడు ఆలోచన.... భగవంతుడున్నాడు"

❖ ❖ ❖

ఆపరేషను పూర్తి అయిపోయింది. డాక్టర్ రెగ్గీ ఆపరేషన్ దుస్తులు విప్పకుండానే థియేటర్ బైటికి వచ్చి, తిన్నగా కమల దగ్గరికి వెళ్ళి, ఆమె భుజాల మీద అతి చనువుతో చేతులు వేసేడు.

నీ మాంగల్యం తెగిపోయింది. అని కూతురితో చెప్పవలసిన తండ్రిలా అతను కుమిలిపోతున్నాడు.

"ఐ హేవ్ డన్ మై బెస్ట్" కాని లాభం లేకపోయిందమ్మా.

❖ ❖ ❖

తర్వాత రెగ్గేనే తల్లినీ, పిల్లడినీ, రిక్షాలు కట్టించి, సింహాచలాన్ని సాయం యిచ్చి పంపించేడు.

ఆ బాబే అలా చెయ్యకపోతే – ఆమె దగ్గరున్న రెండు రూపాయలూ రిక్షాలకే అయిపోయేవి.

ఈ జరీ మొగ్గని.

ఈ కెంపుల కుప్పని,

"పాలిచ్చిన చేతుల్తోనే పాతుకోవాలి తండ్రీ!"

"మీ ధనవంతుల్లో నూటికి ఒక్కడు నీలాంటి వాడుంటే మీ అడుగుల నీడల్లో బ్రతికేస్తాను" అని మనసులోనే దీవిస్తూ ఆమె పిల్లడ్ని చేతిలోకి తీసుకొని నిలబడింది.

చచ్చిపోయిన క్రీస్తుని పట్టుకొని ఏడుస్తున్న మేరీలా వుందామె.

"వస్తాను బాబూ" కృతజ్ఞతతో నిండిపోయిన గుండె అననివ్వలేదు.

❖ ❖ ❖

"అదుగో తోక అంటే యిదుగో పులి అనే ఈ బేడా పరక పత్రిక వెధవలున్నారే. అసలు పులి దొరికితే వదిలేస్తారా? ఈ పాటికి నా మానం బజార్లో అమ్మేసి వుందురు, రెగ్గీ కాపాడి వుండకపోతే –" అన్నాడు మేత్యూ.

"దానికేముందిలే"–తన టెరీపూల్ పేంటు మీద పడిన చిప్స్ ముక్కని ఎడమచేతి చూపుడువేల్తో మీటుతూ అన్నాడు రెగ్గీ.

"యింతకీ ఈ పార్టీ దేనికి?"

రెగ్గీకి, ఎ మిలియన్ థ్యాంక్స్ పర్ ది పీ.యమ్. కృతజ్ఞతలు తెల్పేడు మేత్యూ.

"అంటే?" కంట్రాక్టరు ఆశ్చర్యపోయేడు.

పి.యమ్ అంటే పోస్టుమార్టమ్.

"అంటే!!" కంట్రాక్టరు యింకా ఆశ్చర్యపోయేడు.

"అంటే బెంచీమీదే కునికేసేడు కుర్రవెధవ అని"

**(1971)**

# నువ్వు యిచ్చిన నాన్న

"**దీ**పంలా వున్నావ్. నీకిందే ఖర్మో?"

నశీం నవ్వింది. నీరసంగా, నిరాశగా, అసహజంగా ఆనందం లేని నవ్వు. ఆకాశంలోకి చూసి, కళ్ళు మూసుకొని అల్లాని తలుచుకొని, మళ్ళీ కళ్లు విప్పేసరికి చుట్టూ ఉన్న జనం ఆశతో, ఆనందంతో ఆమెని చూసేరు.

"దేఖో బాబా... ఇతనీ ఛోటీ బచ్చీ...." బాబా తర్వాత మాటలు తాతడోలు శబ్దంలో వినిపించలేదు.

అసలు నశీం సహజంగా – బలంగా – ఆనందంగా – మంచు కొండల మీద వెన్నెల జల్లులా నవ్వగలదు. ఆమె ఎప్పుడూ